# రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి


## ఏడో రౌండ్ టేబుల్ సమావేశంలో రజకుల డిమాండ్



**వి.కోట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు16:**
రాష్ట్రంలోని రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక ఎస్సీ సాధన కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన వి.కోటలో ఆదివారం ఏపీ రజక ఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఏడో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కమిటీ కార్యదర్శి సోమశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర కన్వీనర్ అక్కినపల్లి లక్ష్మయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ.. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలన్నది తమ జాతి చిరకాల వాంఛ అని అన్నారు. జాతి ఐక్యతతో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లి డిమాండ్ సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. చిత్తూరు జిల్లా మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్ షణ్ముఖం మాట్లాడుతూ దేశంలోని 18 రాష్ట్రాల్లో రజకులను ఎస్సీగా, రెండు రాష్ట్రాల్లో ఎస్టీలుగా గుర్తించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం రజకులు ఇప్పటికీ బీసీ–ఏ కేటగిరీలోనే ఉన్నారని పేర్కొన్నారు. 2014 టీడీపీ మేనిఫెస్టోలో రజకకులాన్ని ఎస్సీగా గుర్తించేందుకు కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని, అనంతరం ప్రభుత్వం మారడంతో ఈ అంశంపై వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు దృష్టి సారించలేదని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రజకులకు ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. అలాగే రజక కార్పొరేషన్‌కు తగిన బడ్జెట్ కేటాయించడంతో పాటు ఎస్సీ సబ్‌ప్లాన్ తరహాలో నిధులు, వృత్తిదారులకు ఆర్థిక సహాయం, గృహ వసతి కల్పించాలని కోరారు. ఎస్సీ రిజర్వేషన్ లభిస్తేనే రజకుల పిల్లలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మెరుగైన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. టీడీపీ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు, సీనియర్ నాయకుడు రామచంద్ర నాయుడు మాట్లాడుతూ ఏడో రౌండ్ టేబుల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పలమనేరు ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యావంతులు, మేధావులు, కుల సంఘాల ప్రతినిధులు రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమోదించిన తీర్మాన ప్రతిని నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో లా కాలేజ్ ప్రొఫెసర్ నారాయణ, మల్లల నాగరాజు, మోహన్, చిన్నస్వామి, వి.కోట గంగాభవాని రజక సంఘం సభ్యులు, రజక కులస్తులు పాల్గొన్నారు.

# పేద బ్రాహ్మణ కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ





**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు16:**
హిందూపురం పట్టణంలోని మోడల్ కాలనీలో అత్యంత పేదరికంలో జీవనం సాగిస్తున్న రెండు బ్రాహ్మణకుటుంబాలకు హిందూపురంతాలూకా బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మోడల్ కాలనీలో నివాసం ఉంటున్న శేషగిరిరావు, గురుప్రసాద్ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్న విషయం తెలుసుకున్న హిందూపురం తాలూకా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు జ్యోతి ఆదినారాయణరావు స్పందించి, ఆయా కుటుంబాలకు బియ్యం,పప్పులు, నూనె తదితర నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతి ఆదినారాయణరావు మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు తమవంతు సహాయ సహకారాలు అందించడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.అవసరమైన వారికి భవిష్యత్తులోనూ సహాయం అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోటిపి నాగేశ్వరరావు,మురళి దేశాయి, రాజేంద్ర ప్రసాద్, శ్రీధర్,శ్రీనివాసరావు,నాగరాజు, ఫణిభూషణ్,శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

# నేడే ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు16:**



కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు కడ ఆధ్వర్యంలో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కడ పిడి వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో కుప్పం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం కొనసాగుతుంది. నియోజకవర్గంలోని వివిధ ప్రాం తాలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలను నేరుగా పిడికి అందజేయవచ్చు. ప్రజల నుంచి స్వీకరించిన వినతులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేలా కడ అధికారులు పర్యవేక్షించనున్నారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను స్పష్టంగా వివరించే వినతిపత్రాలను సమర్పించాలని సూచించారు. కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది హాజరుకానున్నారు.

# ఎల్‌నినోపై రైతులకు ఉద్యాన శాఖ అవగాహన



**వి.కోట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు16:**
ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు, పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వి.కోట మండలంలోని రైతులకు ఉద్యాన శాఖ అధికారులు అవగాహన కల్పించారు. పంటలకు నీటి లభ్యతను పెంచుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఏడీహెచ్ పల్లవి, ఉద్యాన శాఖ అధికారి మౌనిక, ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జీలు రైతులతో మాట్లాడి ఉద్యాన పంటల సంరక్షణకు అందుబాటులో ఉన్న పథకాలను వివరించారు. వ్యక్తిగత పట్టా భూముల్లో ఫారం పాండ్లు(నీటి కుంటలు) నిర్మించుకునే రైతులకు 50 శాతం సబ్సిడీ కింద గరిష్ఠంగా రూ.90 వేల వరకు రాయితీ అందిస్తామని తెలిపారు. అదేవిధంగా సుమారు ఐదుగురు రైతులు కలిసి తమ భూముల్లో కమ్యూనిటీ ఫారం పాండ్ ఏర్పాటు చేసుకుంటే 75 శాతం సబ్సిడీ కింద గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు రాయితీ అందజేస్తామని పేర్కొన్నారు. నీటి నిల్వలను పెంచుకోవడం ద్వారా ఎండాకాలంలో పంటలకు నీటి కొరతను అధిగమించవచ్చని సూచించారు. మామిడి,చీనీ, దానిమ్మ, నిమ్మ, రోజా, అవకాడో తదితర ఉద్యాన పంటలను కలుపు మొక్కల నుంచి సంరక్షించేందుకు వీడ్ మ్యాట్ వినియోగించే రైతులకు ఎకరానికి 50 శాతం సబ్సిడీ కింద రూ.లక్ష వరకు రాయితీ అందిస్తామని అధికారులు తెలిపారు. ఈ పథకంలో ఒక్క రైతు గరిష్ఠంగా ఒక ఎకరానికి మాత్రమే అర్హుడని స్పష్టం చేశారు. మండలంలోని పడిగలకుప్పం, కృష్ణాపురం,తోటకనుమ,పాపేపల్లి గ్రామాల్లో రైతులతో అధికారులు మాట్లాడి ప్రభుత్వ రాయితీ పథకాలపై అవగాహన కల్పించారు. రైతులు పథకాలను సద్వినియోగం చేసుకుని ఉద్యాన పంటలను అభివృద్ధి చేసుకోవాలని అధికారులు కోరారు.

# ఆటో ప్రయాణికుల భద్రతకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు16:**
శ్రీకాళహస్తి ఆటోల్లో ప్రయాణించే ప్రయాణికుల భద్రతకు పోలీసులు నూతన విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి సబ్‌డివిజన్ పోలీసులు పట్టణంలోని బేరి వారి మండపం వద్ద ఆటోలకు క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రత్యేక స్టిక్కర్లను ఆటో డ్రైవర్లకు అందజేశారు.ఈ స్టిక్కర్‌లో ఆటోకు సంబంధించిన పూర్తి వివరాలను క్యూఆర్ కోడ్ రూపంలో పొందుపరిచారు. ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్‌తో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఆటోకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకోవచ్చని పోలీసులు తెలిపారు. అంతేకాకుండా మొబైల్ ట్రాకింగ్ సదుపాయం కూడా ఉండడంతో ప్రయాణికుల భద్రతకు మరింత భరోసా కలుగుతుందని పేర్కొన్నారు. ప్రయాణికుల రక్షణను దృష్టిలో ఉంచుకుని ఈ నూతన విధానాన్ని ప్రవేశపెట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి వన్ టౌన్ సిఐ వెంకటేశ్వర్లు, టూ టౌన్ సిఐ నాగరాజు, శ్రీకాళహస్తి రూరల్ సిఇబ్రహీం, బి.ఎన్ కండ్రిగ సిఐలక్ష్మీనారాయణ, ఎస్సైహరిప్రసాద్‌లు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి పట్టణంలోని వెల్లంపాలెంలో కార్డెన్ సెర్చ్



**శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు16:**
శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని వెల్లంపాలెంలో నేరాల నియంత్రణకు, శాంతిభద్రతల పరిరక్షణకు మరియు ప్రజల్లో భద్రతా భావన కల్పించే విధంగా పోలీస్ శాఖ నిర్వహించే ఆకస్మిక తనిఖీ లను కార్డెన్ సెర్చ్ నిర్వహించి.మహిళల భద్రత, సైబర్ మోసాలు మరియు రక్షణ చట్టాల గురించి మత్తు పదార్థాల వినియోగం వల్ల వాటిల్లే నష్టాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో యువతతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. డీఎస్పీన్స్ మూర్తి మాట్లాడుతూ... మహిళా భద్రతా, సాధికారితపై అవగాహన కల్పిస్తున్నామని మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చట్టాలు రూపొందించింది. మహిళకు వేధింపులు ఎదురైతే 100,1930,181 హెల్ప్‌లైన్లను సంప్రదించాలని, ప్రతి ఒక్కరూ మహిళల గౌరవాన్ని కాపాడాలని తెలియజేశారు మహిళా రక్షణ చట్టాలపై ప్రతి ఒక్కరూ సమగ్ర అవగాహన కలిగి ఉండాలిని, మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదకర వ్యసనమని విద్యార్థులు యువత డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండి తమ లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం,రవాణా,విక్రయాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎవ్వరైనా మత్తుపదార్థాలు విక్రయిస్తున్నారని సమాచారం ఉంటే 9490492020 నంబర్‌కు ఫోన్ వివరాలు చేపవచ్చిని సమాచారం చెప్పిన వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు. 100 ద్విచక్ర వాహనాలు 20 ఆటోలు సీజ్ చేసినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ వెంకటేశ్వర్లు,టూ టౌన్ సీఐ నాగరాజు,, శ్రీకాళహస్తి రూరల్ సిఐ ఇబ్రహీం, బుచ్చినాయుడు కండ్రిగ సర్కిల్ సిఐ లక్ష్మీనారాయణ, బుచ్చినాయుడు కండ్రిగ ఎస్సై హరిప్రసాద్,పోలీసు బృందం పాల్గొన్నారు.

చదవండి.. చదివించండి
చిత్తూరు ఎక్స్‌ప్రెస్

# కనమనపల్లిలో ఇంటింటా భగవద్గీత ప్రచారం

## శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఆధ్యాత్మిక గ్రంథాలపై అవగాహన



**గుడుపల్లి, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు16:**
శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలు, ఇందూ ధర్మం, శ్రీకృష్ణ భగవానుడి విశిష్టతపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని ఆదివారం గుడుపల్లి మండలం కనమనపల్లి గ్రామంలో నిర్వహించారు. త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక కుప్పం, శివరాంపురం కమిటీల ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల ప్రాధాన్యతను వివరించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టత, శ్రీకృష్ణుడి తత్వం, భగవద్గీతలోని ఆధ్యాత్మిక సందేశాలను ప్రజలకు వివరించారు. ఆధ్యాత్మిక విలువలు, ధర్మాచరణపై అవగాహన పెంపొందించడంతో పాటు భగవద్గీత సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.శ్రీకృష్ణుడి ఊరేగింపుపై అవగాహన శ్రీకృష్ణుడు భగవంతుడిగా అవతరించి మానవ రూపంలో జన్మించిన దైవ స్వరూపుడని, ఆయనకు మాత్రమే ఊరేగింపు నిర్వహించాలనే ఉద్దేశంతో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు సమితి సభ్యులు తెలిపారు. పూర్వకాలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను 11 రోజులపాటు నిర్వహించి, చివరి రోజున శ్రీకృష్ణుడి విగ్రహంతో ఊరేగింపు నిర్వహించి వేడుకలను ముగించే సంప్రదాయం ఉండేదని పేర్కొన్నారు. ఈ సంప్రదాయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కుప్పం,శివరాంపురం కమిటీల అధ్యక్షులు కృష్ణ, కృష్ణమూర్తి, సభ్యులు ప్రకాష్,దేవరాజు, సర్వణ,వాణి,రాణి,బిందు తదితరులు పాల్గొన్నారు.

# కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందికి 'సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్'



**కుప్పం,చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు16:**
80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం Certificate of Merit ప్రదానం చేసింది. ప్రభుత్వ కార్యాలయాల్లో విధి నిర్వహణలో ప్రజలకు మెరుగైన సేవలు అందించినందుకు గుర్తింపుగా ఈ అవార్డులను అందజేశారు. కుప్పం సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ వినోద్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ నాయుడు తదితరులు ఈ అవార్డులను అందుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, విధి నిర్వహణలో చూపిన నిబద్ధతకు గుర్తింపుగా ఈ ప్రశంసా పత్రాలు లభించాయి. జిల్లా ఉన్నతాధికారులు వారిని అభినందిస్తూ, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందికి పలువురు అధికారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# పేద విద్యార్థినికి ఎంపీ దగ్గుమళ్ల ఆర్థిక చేయూత

## రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేత



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు16:**
నిరుపేద విద్యార్థినికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు ఆర్థిక చేయూత అందించారు. విద్యాభ్యాసానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థినికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. చిత్తూరు నగర పరిధిలోని 25వ డివిజన్ కుక్కలపల్లికి చెందిన గోవిందరాజులు కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. గోవిందరాజుల కుమార్తె చిత్తూరు సమీపంలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి కారణంగా కుమార్తె విద్యాభ్యాసాన్ని కొనసాగించడం కష్టంగా మారిన విషయం స్థానికుల ద్వారా ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు దృష్టికి వెళ్లింది. దీంతో స్పందించిన ఎంపీ విద్యార్థినికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అండగా ఉంటారని ఆయన కుటుంబానికి భరోసా కల్పించారు. ఆపద సమయంలో తమ కుటుంబానికి బాసటగా నిలిచి, కుమార్తె చదువుకు ఆర్థిక సహాయం అందించిన ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుకు గోవిందరాజులు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా బూత్ ఇంచార్జ్ లోకేష్ బాబు జన్మదిన వేడుకలు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు16:**
చిత్తూరు జిల్లా కుప్పం మునిసిపాలిటీ 20వ వార్డుకు చెందిన 167వ బూత్ ఇంచార్జ్ కే.లోకేష్ బాబు జన్మదిన వేడుకలను టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తూ, బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న లోకేష్ బాబు సేవలను నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ప్రజలతో మమేకమై పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ముందు కు తీసుకెళ్లడంలో ఆయన చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. జన్మదినం సందర్భంగా లోకేష్ బాబు మరిన్ని రాజకీయ విజయాలు సాధించాలని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో పార్టీకి మరింత సేవ చేస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని లోకేష్ బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

